క్లుప్తంగా

తల్లులకు ప్రీస్కూల్ విద్యపై అవగాహన



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): జనబాగీ దారీ కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లులకు అవగాహన కల్పించటంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు ప్రీస్కూల్ విద్యపై అవగాహన కల్పించటంతో పాటు పీపీ1, పీపీ2 సిలబస్ పుస్తకాలు, చైల్డ్ అసెస్మెంట్ నివేదిక, పిల్లలు తయారు చేసిన ప్రీ స్కూల్ మెటీరియల్‌ను కూడా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రదర్శించారు. మెటీరియల్ ఎన్ని రకాలుగా ఉపయోగపడతాయో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడపాటి లావణ్య, ఉపసర్పంచ్ గుత్తా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచి కాలుష్యాన్ని నివారించండి



కంచికచర్ల: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలందరూ సహకరించాలని సర్పంచి బొక్కా రవికుమార్ అన్నారు. మండలంలోని గండేపల్లిలో సోమవారం రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకంతో గ్రామంలో అన్ని రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నామని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటేందుకు వెయ్యి మొక్కలకు ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి బి.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేదాద్రి నరసింహస్వామి ఆలయ ఈవోగా హేమలత



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో ఉన్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ఈవోగా విజయవాడ పాత శివాలయం ఈవోగా పని చేస్తున్న సిరపరపు హేమలతా దేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఈవోగా పని చేస్తున్న నాగరాజు విజయవాడకు బదిలీ అయ్యారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేయటంతో పాటు సిబ్బంది సహకారంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హేమలత తెలిపారు. అనంతరం అర్చకులు ఆమెకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు.

బడిఈడు పిల్లలను బడికి పంపాలి

నందిగామటౌన్: బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు పనులకు కాకుండా విధిగా బడికి పంపాలని జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు అన్నారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం బాల కార్మిక చట్టంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కరరావు, ప్రకాశరావు, ఆజాద్, మల్లేశ్వరరావు, కుసుమకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు కరుణ, మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో సోమవారం 3, 7 సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు తనిఖీ చేశారు. వైఎస్సార్ బీమా, అమ్మ ఒడి వెరిఫికేషన్, సిటిజన్ ఔట్ రీచ్ మొదలగు పథకాలకు సంబంధించి వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది వారి పరిధిలో ఉన్న వాటిని 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత నోడల్ అధికారులను వారికి కేటాయించిన సచివాలయాలను ఎప్పటికప్పుడు వారి పనితీరును పర్యవేక్షిస్తుండాలని ఆదేశాలు జారీ చేశారు. శానిటేషన్ కార్యదర్శులు ఉదయం 5.30 గంటలకు విధులకు హాజరుకావాలని, అట్లు విధులకు హాజరు కాని వారిని విధుల నుంచి నిలుపుదల చేయడానికి ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తామన్నారు.

ఆర్డీఓ స్పందనకు 14 అర్జీలు

నందిగామటౌన్: స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని ఆర్డీఓ రవీంద్ర అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి 14 అర్జీలు అందాయన్నారు. వాటిలో రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 10 అర్జీలు రాగా హౌసింగ్ ఒకటి, పోలీస్ ఒకటి, మున్సిపల్‌కు సంబంధించి రెండు అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పండుగలా కానుక పంపిణీ

- నందిగామలో జేవీకే కిట్లు అందజేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- కిట్లను ఆనందంగా అందుకున్న విద్యార్థులు



నందిగామలో జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు సాధ్యం కాని రీతిలో విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. పాఠశాలల పునః ప్రారంభం రోజునే కిట్‌లు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్ర, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాడుగుల నాగరత్నం, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాములపాటి రమేష్, నాయకులు గుడివాడ సాంబశివరావు, పాకాలపాటి కిరణ్, యాకుబ్ అలీ, బాపట్ల సాంబయ్య, తానూరి రాము, దాసు, జాఫర్, ఎంఈవో బాలాజీ, ప్రధానోపాధ్యాయురాలు విజయ లక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ భవాని పాల్గొన్నారు.

వీరులపాడులో...

వీరులపాడు: విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. పెద్దాపురం గ్రామంలోని ఏహెచ్‌యూపీ పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆమె జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెప్పాడంటే చేస్తాడని ప్రజల్లో నమ్మకం

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



జమ్మవరం గ్రామంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జమ్మవరం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే చెప్పాడంటే కచ్చితంగా చేస్తాడనే మంచి పేరు తెచ్చుకున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని జమ్మవరం గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ కుల, వర్గ, మత భేదాలు లేని సమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. ఏ ఒక్క వర్గానికో కొమ్ము కాయకుండా అన్ని వర్గాలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో తాము ప్రజల ముందుకు సగర్వంగా వెళ్తున్నామని తెలిపారు. ప్రజలకు నిరంతరం మంచి చేయాలనే తపనతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి పూర్తి మద్దతు పలకాలని జగన్‌మోహనరావు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పార్టీ గ్రామ కన్వీనర్ నన్నెబోయిన తిరుమలరావు, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు యాదాల దాసు, మేచర్ల రమేష్, నాగేశ్వరరావు, సురేష్, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక విద్యార్థులకు వరం



పెనుగంచిప్రోలులో విద్యాకానుక అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు నాగమణి, ఎంపీపీ గాంధీ



వత్సవాయిలో జగనన్న విద్యాకానుక అందిస్తున్న సర్పంచ్ సీతమ్మ, జెడ్పీటీసీ దేవమణి తదితరులు



పేటలోని కాకానినగర్ ప్రభుత్వ పాఠశాలలో జేవీకే కిట్లను పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ ప్రభాకర్

వత్సవాయి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక వరమని వత్సవాయి సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి తెలిపారు. సోమవారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ప్రభుత్వం అందించిన జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, వర్క్‌బుక్‌లు, యూనిఫామ్, బూట్లు, సాక్సులు, బెల్టు, బ్యాగుతో పాటు ఆక్స్‌ఫర్డు ఇంగ్లిషు డిక్షనరీని కానుకలో అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాఠశాలలు తెరిచిన నాలుగైదు నెలల తరువాత విడతల వారీగా పుస్తకాలు యూనిఫాం అందించే వారని, నేడు విద్యార్థులకు పాఠశాలలు తెరిచిన రోజునే వీటిని అందించడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొలికపోగు వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు, ఎంఈవో ఎల్.నాగరాజు పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విద్య పైనే దేశ భవిష్యత్తు ఆధారం

పెనుగంచిప్రోలు: విద్య పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యా రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న విద్యా కానుక సోమవారం పాఠశాలలు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు అందించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేనికుమారి, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకట నర్సు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ చుంచు బెనర్జీ, హెచ్ఎం కె.జలజ, ఎంపీటీసీ సభ్యులు జంగం వీరమ్మ, చాట్ల సుశీల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

జగ్గయ్యపేట అర్బన్: భారతదేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ఆదరణ తగ్గిపోతున్న ప్రభుత్వ పాఠశాలలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జవసత్వాలు కల్పించారని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా సోమవారం స్థానిక ఆరవ వార్డు కాకానినగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఐదవ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ అందజేశారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు జార్జి, దాసు, హెచ్ఎం వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 22 వ వార్డు నాగమయ్య బజారులోని ప్రభుత్వ పాఠశాలలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షేక్ బషీరున్నీసా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు.



విద్యా కానుక కిట్‌లతో ధర్మవరప్పాడుతండా పాఠశాల విద్యార్థులు

ధర్మవరప్పాడు తండాలో...

ధర్మవరప్పాడుతండా(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం పాఠశాలలు పునః ప్రారంభం కావటంతో 2023-24 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యా కానుక కిట్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. అన్నవరం గ్రామంలో సర్పంచ్ మీగడ వెంకటేశ్వర్లు, పోచంపల్లిలో సర్పంచ్ బూతుకూరి లక్ష్మీ నాగిరెడ్డి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లు అందజేశారు. పండుగలా సాగిన కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

మోగిన బడి గంట : అందిన విద్యాకానుక



కంచికచర్లలో జేవీకే కిట్లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ ప్రశాంతి, సర్పంచి సునీత, ఎంఈఓ

కంచికచర్ల: బడి గంట మోగిన రోజునే ప్రభుత్వం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేసింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచి సునీత, ఉపసర్పంచి సురేష్‌బాబు, ఎంఈఓ చిట్టిబాబుతో కలసి సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తోందన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలసి జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేశామని తెలిపారు. పాఠశాలల్లో పండగ వాతావరణం కనిపించిందని విద్యార్థులందరూ కిట్లను అందుకుని ఆనందంగా గంతులు వేస్తున్నారని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం వారం రోజుల పాటు పాఠశాలలు ఒంటిపూట నడపనున్నట్టు తెలిపారు. మండలంలోని మోగులూరు ఎంపీపీ స్కూల్‌లో వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, గండేపల్లిలో సర్పంచి రవికుమార్, గొట్టుముక్కలలో ఎంపీటీసీ సభ్యురాలు గుదే సరస్వతి, పరిటాలలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, చెవిటికల్లులో సర్పంచి బుడ్డి విజయలక్ష్మి జేవీకే కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీలు ప్రభుత్వానికి అండగా ఉండాలి



చిల్లకల్లు(జగ్గయ్యపేట): ముస్లిం మైనార్టీలు ప్రభుత్వానికి అండగా ఉండాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. హర్ దిల్‌మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని జమ్మా మసీదు వద్ద ముస్లింలతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మైనార్టీలు రుణపడి ఉన్నారన్నారు. ఉర్దూ భాషకు రెండవ అధికారిక భాష హోదా కల్పించటంతో పాటు మసీదు ఇమామ్, మౌజన్‌ల వేతనాలను రూ.10 వేలు, ఐదు వేలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను రక్షించేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నారని చెప్పారు. జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి జుబేర్, నాయకులు అజ్మత్ మజీద్, అబ్దుల్ మజీద్, లాల్‌జాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యాదానం ఎంతో గొప్పది

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): విద్యాదానం ఎంతో గొప్పదని సర్పంచ్ గూడపాటి లావణ్య అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థి నలజాల సుమానయ్య కుమారుడు నరేష్ సుమారు రూ.35 వేల విలువ చేసే బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, పెన్నులు తదితర సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, హెచ్ఎం షేక్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు మంత్రి జోగి రమేష్ అభినందన

ఇబ్రహీంపట్నం: ప్రపంచ సిలబం(కర్రసాము) చాంపియన్ షిప్ క్రీడాకారులకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అభినందనలు తెలిపారు. ఇటీవల బెంగళూరులో జరిగిన సిలంబం ప్రపంచ చాంపియన్ షిప్‌లో పతకాలు సాధించిన నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు సోమవారం మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. పురుషుల సీనియర్ విభాగంలో కె.సత్యశ్రీకాంత్ సింగిల్ స్టిక్ ఫైట్, కత్తి ప్రదర్శనలో మూడు పసిడి పతకాలు, డబుల్ స్టిక్‌లో రజిత పతకం, బాలికల జూనియర్ విభాగంలో హియా ముఖేష్‌జైన్ సింగిల్, డబుల్ స్టిక్‌లో రెండు కాంస్యం, వి.సాత్విక్ రజిత పతకం సాధించినట్లు మంత్రికి వివరించారు. మంత్రి జోగి రమేష్ క్రీడాకారుల మెడలో మెడల్స్ వేసి అభినందించారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కౌన్సిలర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులకు ఎమ్మెల్యే సూచన



కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ పట్టణంలో చేస్తున్న అభివృద్ధిని పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సభ్యులు, ముఖ్య నాయకులతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశామన్నారు. గడిచిన 30 ఏళ్లలో జరగనంత అభివృద్ధిని రెండేళ్లలో చేసి చూపించామని చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందని ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పట్టణంలోని 20 వార్డుల పరిధిలోని సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సూచించారు. ముఖ్యంగా ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజలతో మమేకమవటంతో పాటు గుర్తించిన సమస్యలను మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల అజెండాలో పెట్టించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాడుగుల నాగరత్నం, కౌన్సిల్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: మహిళా పక్షపాతిగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, వాటిని మహిళలంతా సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. పట్టణంలోని 11 వ వార్డు దుర్గాపురంలో సోమవారం మెప్మా ఆధ్వర్యంలో కనకదుర్గ మహిళా సమాఖ్య వారు ఏర్పాటుచేసిన డ్వాక్రా మహిళల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాల్లో మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత తదితర పథకాలన్నీ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకే అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని వారు ముందుకు పోవాలన్నారు. అనంతరం దుర్గాపురం పరిసర ప్రాంత ప్రజలను కలిసి అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సమస్యను స్థానికులు ప్రస్తావించగా, త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ స్కిల్స్ కళాశాల ఏర్పాటుతో యువతకు ఉపాధి

ప్రభుత్వ విప్ ఉదయభాను



లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఏర్పాటు వలన పారిశ్రామిక వాడగా ఉన్న జగ్గయ్యపేట ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఈనెల 14 వ తేదీన ప్రారంభించనున్న లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్యే ఉదయభాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేట పరిసర ప్రాంత పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పించే లైఫ్ స్కిల్స్ ఇంటర్మీడియెట్ వృత్తి విద్య కళాశాలను జగ్గయ్యపేటలో ప్రప్రథమంగా ఏర్పాటుచేయడం ఈ ప్రాంత విద్యార్థులకు సువర్ణ అవకాశం అన్నారు. అందుకు కళాశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. మెరుగైన సౌకర్యాలతో ఈ కళాశాలను ఏర్పాటుచేశామని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. కోర్సులకు సంబంధించి ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫిమేల్), ల్యాబ్ టెక్నీషియన్(ఎంఎల్‌టీ), ఎలక్ట్రికల్ టెక్నీషియన్(ఈటీ), డెయిరీ టెక్నాలజీ అండ్ వెటర్నరీ(ఎల్ఎం అండ్ డీ) వంటి మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించే కోర్సులను ఈ సంవత్సరం నుంచే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు తన్నీరు నాగేంద్ర, శేషం ప్రసాద్, కళాశాల ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, పెనుగొండ వెంకట రాజీవ్, తంగెళ్ల వెంకటేశ్వరరాజు, జల్లా తిరుపతిరావు, వంగరి లక్ష్మీనారాయణరావు, రంగాపురం మణికంఠ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సీఎం పూర్తి సహకారం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: దేవాలయాల అభివృద్ధితో పాటు నూతన ఆలయాల నిర్మాణాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని అల్లూరు గ్రామంలో ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకగా అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ సీఎం జగన్ ఆలయాల అభివృద్ధి, నిర్మాణాలతో పాటు ఆదాయం లేని ఆలయాలకు సైతం ధూపదీప నైవేద్యాల కింద నెలకు రూ.ఐదు వేల ఆర్థిక సహకారం అందిస్తున్నారని తెలిపారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.10 లక్షల ఆర్థిక సహకారంతో ఈ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

నందిగామటౌన్: గ్రామస్తులంతా ఐక్యంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించుకోవటం అభినందనీయమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు గ్రామంలో ముత్యాలమ్మ, నాంచారమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహోత్సవాలకు విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామ నాయకులు, నిర్వాహకులు ఘన స్వాగతం పలుకగా అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ముందుగా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహోత్సవ నిర్వాహకులు, గ్రామ నాయకులు ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, రాయల జానకిరామయ్య పాల్గొన్నారు.